ప్రజాశక్తి

శనివారం 02 మార్చి 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

అట్టహాసంగా విద్యాదీవెన

- పామర్రులో సిఎంకు ఘన స్వాగతం
- విద్యార్థులు, మహిళలకు కష్టాలు
- తాగునీరు, అల్పాహారం సరఫరాలో నిర్లక్ష్యం

హాజరైన జనం

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

పామర్రులో శుక్రవారం విద్యాదీవెన కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్న ఈ కార్యక్రమానికి పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల విద్యార్థులను ఆయా కళాశాలల బస్సుల్లోనే జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో తరలించారు. డ్వాక్రా గ్రూపుల మహిళలను పెద్ద సంఖ్యలో సభా ప్రాంగణానికి తీసుకు వచ్చారు. పామర్రు మార్కెట్ యార్డు సమీపంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద నుంచి సభాస్థలి బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వరకు విద్యార్థులు, మహిళలు రోడ్డుకు ఇరువైపులా నిలబడి జగన్‌కు ఘన స్వాగతం పలికారు. విజయవాడ రోడ్డులో అసెస్సీ స్కూల్ వద్ద, బందరు రోడ్డులో మార్కెట్ యార్డు వద్ద, చల్లపల్లి రోడ్డులో గ్రామానికి దూరంగా ఉన్న రియల్ ఎస్టేట్ భూముల్లో వాహనాలకు పార్కింగ్‌కు కేటాయించారు. రానుబోను మూడు కిలోమీటర్లకుపైగా విద్యార్థులు, మహిళలు నడిచి సభా స్థలికి చేరుకోవాల్సి వచ్చింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కార్యక్రమం ముగిసే వరకు ఉన్న విద్యార్థులకు కనీస అల్పాహారం ఇవ్వలేదని, ఎండ తీవ్రత అధికంగా ఉన్నా తాగునీరు సరఫరా చేయలేదని పలువురు వాపోయారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి సిఎం కాన్వాయ్ బయలుదేరే సమయంలో సిఐ అత్యుత్సాహం ప్రదర్శించారు. సమీపంలోని ఉన్న వారిని వెనక్కి నెట్టారు. దీంతో విజయవాడకు చెందిన దాసరి సురేష్ కిందపడిపోయారు. చేయి విరిగిపోవడంతో మచిలీపట్నం ఆసుపత్రికి తరలించారు. పామర్రులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద మంత్రులు బొత్స సత్యనారాయణ, జోగి రమేష్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక,

(మిగతా 6లో)

బటన్ నొక్కి నిధులు విడుదల చేస్తున్న సిఎం జగన్మోహనరెడ్డి

రోడ్లకు నిధులివ్వండి : సిఎంకు ఎంఎల్‌ఎ కైలే విజ్ఞప్తి

పామర్రు అసెంబ్లీ నియోజకవర్గంలో రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ కోరారు. 'విద్యాదీవెన' కార్యక్రమంలో ఎంఎల్‌ఎ అనిల్ మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై సిఎం జగన్ స్పందిస్తూ పామర్రు నియోజకవర్గ సమస్యలను యుద్ధ ప్రాతిపధికన పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

అనిల్‌ను దీవించండి

అనిల్‌లాగా ప్రతి ఎమ్మెల్యే ఉంటే ప్రతి నియోజకవర్గానికి మంచి జరుగుతుందని, నిజాయితీ, నిబద్ధత ఉన్న అనీల్‌ను మీరంతా దీవించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పామర్రులో జరిగిన విద్యాదీవెన కార్యక్రమంలో జగన్ ఈవిధంగా మాట్లాడటం ప్రాధాన్యతను సంతరించుకుంది. వైసిపి ఎంపి, ఎంఎల్‌ఎ అభ్యర్థుల జాబితాల్లో ఇప్పటి వరకు అనిల్ పేరును ప్రకటించలేదు. అనిల్‌ను ప్రజలు దీవించాలని చెప్పడం ద్వారా పరోక్షంగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ వైసిపి పామర్రు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు అనిల్‌కు లైన్ క్లియర్ అయిందనే చర్చ జరుగుతోంది.

విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి పంపుతున్న సిబ్బంది

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

పరీక్షా కేంద్రంలో తమ నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం నుండి ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు సంబంధించి సెట్ నెంబర్ -1 ప్రశ్నాపత్రాన్ని అందచేశారు. పరీక్షల సందర్భంగా అధికారులు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయడంతో తొలిరోజు పరీక్షలో ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించినట్లు ఇంటర్ బోర్డు అధికారులు ప్రకటించారు. పరీక్షకు సంబంధించి ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా 99 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేయగా మొత్తం 39544 మందికిగాను 38,822 మంది విద్యార్థులు హాజరయ్యారు. 722 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, ఉదయం 8 గంటల నుండే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవడంతో పరీక్షా కేంద్రాల వద్ద తీవ్రమైన రద్దీ నెలకొంది. ఉదయం 8.30 గంటలకు విద్యార్థులను పరీక్ష హాల్‌లోకి అధికారులు అనుమతించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్

(మిగతా 6లో)

ట్రాఫిక్ జామ్

- విద్యార్థులు, తల్లిదండ్రుల అవస్థలు
- పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు తంటాలు
- 20-30 కిమీ దూరంలో కేంద్రాలు

పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఉదయం 9 గంటలకు పరీక్ష కాగా, 8.30 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని విద్యాశాఖాధికారులు చెప్పడంతో తీవ్ర అవస్థలకు గురయ్యారు. కొంతమంది విద్యార్థులకు 20 నుండి 30 కిలో మీటర్ల వరకు దూరంలో ఉన్న పరీక్షా కేంద్రాలను కేటాయించడంతో ఉదయమే బయలుదేరాల్సి వచ్చింది. విజయవాడ

(మిగతా 6లో)

సీట్ ఫైట్

- వసంత X దేవినేని
- మైలవరం టిడిపి సీటు కోసం కుస్తీలు
- అయోమయంలో పార్టీ శ్రేణులు



ప్రజాశక్తి - మైలవరం : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో మైలవరం నియోజకవర్గానికి సంబంధించి టిడిపిలో తీవ్రపోటీ నెలకొంది. ఓవైపు వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్...టిడిపి అధిష్టానం టికెట్ విషయంలో తనకు హామీ ఇచ్చిందని, మైలవరం టిడిపి సీటు తనదేనని విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. వారం రోజుల నుండి నియోజకవర్గంలోని పలువురు నాయకులను కలుసుకొని టిడిపి తరపున పోటీ చేస్తున్నానని, అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మైలవరంలో తాను గతంలో ఏర్పాటు చేసిన వైసిపి కార్యాలయానికి ఉన్న రంగులను, బోర్డులను తొలగించి పసుపు రంగులు వేయించారు. ఎన్నికల ప్రచార రథాన్ని కూడా సిద్ధం చేసుకున్నారు. ఈనేపథ్యంలో ఈనెల 2న వసంత కృష్ణ ప్రసాద్ నందిగామ నియోజకవర్గంలోని తన స్వగ్రామమైన ఐతవరం నుండి భారీ ర్యాలీగా హైదరాబాద్ వెళ్లి లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లోని కొంతమంది వైసిపి నాయకులు వసంతతోపాటు టిడిపిలో చేరేందుకు సిద్ధమయ్యారు. అందుకు కావాల్సిన బస్సులు, సుమారు 100 వరకు కారులను ఏర్పాటు చేసినట్లు సమాచారం. నాలుగు మండలాల్లోని వార్డ్ మెంబర్లు, వసంత అభిమానులు, స్థానిక ప్రజాప్రతినిధులు వైసిపిని వీడి వసంతతోపాటు నడవడానికి సిద్ధంగా ఉన్నారని విస్తతంగా ప్రచారం జరుగుతోంది. మరోవైపు గొల్లపూడిలోని టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు శుక్రవారం సాయంత్రం నియోజకవర్గస్థాయి టిడిపి నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. మైలవరం సీటు తనదేనని కార్యకర్తలు, నాయకులు దగ్గర ఉమా పేర్కొంటున్నారు. టిడిపి అధిష్టానం సీటు లేదని తేల్చినా మైలవరం సీటు విషయంలో "తగ్గేదే లే' అన్న విధంగా దేవినేని ఉమా వ్యవహరిస్తున్నారు. దీంతో వసంత, దేవినేని ఉమా మధ్య సీట్ ఫైట్ కొనసాగుతోంది. సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు వ్యతిరేక పోస్టింగులు పెట్టిస్తున్నారు. ఈనెల 2న మరోదఫా టిడిపి అభ్యర్థుల జాబితా విడుదలయ్యే అవకాశం ఉందని తెలిసింది. రెండో జాబితాలో తప్పకుండా తన పేరు ఉంటుందని ఉమా చెబుతున్నట్లు తెలిసింది. ఇలా ఎవరికి వారే మైలవరం సీటు తనదంటే తనదని వసంత, దేవినేని చెప్పుకుంటుండడంతో టిడిపి శ్రేణులు అయోమయానికి గురవుతున్నాయి.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

ఉద్యోగ అవకాశాలు

విలేకర్లు కావలెను

ప్రజాశక్తి దినపత్రికలో పని చేసేందుకు
కింది ప్రాంతాలకు విలేకరులు కావలెను.

విద్యార్హత: ఇంటర్, ఆ పైన..

విలేకరులు కావాల్సిన కేంద్రాలు:

ఎన్‌టిఆర్ జిల్లా
- విజయవాడ నగరంలో నాలుగు ఖాళీలు
- విజయవాడ రూరల్
- జి.కొండూరు

కృష్ణాజిల్లా
- పెనమలూరు
- పామర్రు
- నాగాయలంక
- గూడూరు
- కృత్తివెన్ను
- నందివాడ

ప్రాథమిక అర్హతలు :
- తెలుగులో స్పష్టంగా రాయగల నైపుణ్యం
- జిల్లా, రాష్ట్ర రాజకీయాలపై ప్రాథమిక అవగాహన
- కంప్యూటర్ తెలుగు టైపింగ్
- ఏదైనా తెలుగు పత్రికలో ఒక సంవత్సరం అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత..

ఆసక్తి గల వారు తమ బయోడేటాను కింది నెంబర్లకు వాట్సాప్‌గానీ, vjadesk@gmail.com మెయిల్‌కుగానీ పంపగలరు

:: హాజరుకావాల్సిన చిరునామా ::
ప్రజాశక్తి కార్యాలయం
అరవింద హైస్కూల్ వద్ద, తాడేపల్లి

సంప్రదించాల్సిన నెంబర్లు
9490099206, 9490099530, 9490099218

ఇంటర్న్‌షిప్‌తో నైపుణ్యం మెరుగుదల

కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లక్కిరెడ్డి బాల్రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవ లక్ష్య 2కె24 కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని లక్కిరెడ్డి జయప్రకాశ్ రెడ్డి హానరరీ చైర్మన్, డాక్టర్ లకిరెడ్డి హనీమిరెడ్డి ఎల్బిఆర్సి ట్రస్ట్, జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన సౌగత సెన్ ఎక్స్‌ఎల్‌ఆర్ జంషెడ్‌పూర్ హెడ్ ఆఫ్ క్యాంపస్ రిక్రూట్మెంట్స్ హార్డ్వేర్ టెక్నాలజీస్ మాట్లాడుతూ పరిశ్రమలలో ఇంటర్న్ షిప్పులు చేయటం వల్ల విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు. ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల్లోని 80 ప్రముఖ విద్యాసంస్థల నుండి 5,500 పైగా విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నార్త్ సౌత్ మేక శ్రీలత, ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.హరినాథ్ రెడ్డి, తిమ్మారెడ్డి వివిధ విభాగాధిపతులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒగా రవీంద్రరావు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ రెవిన్యూ డివిజనల్ అధికారిగా ఏ.రవీంద్రరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నందిగామ ఆర్డీవోగా పని చేశారు. ప్రస్తుత ఆర్డీవో సాయిబాబు బదిలీ అయ్యారు. పలువురు రెవిన్యూ, శాఖల అధికారులు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

స్వర్గపురికి ఉచిత వాహనం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : కొన్ని సంవత్సరాలుగా పారామౌంట్ అధినేత వెనిగళ్ళ సురేష్ పారామౌంట్ ఫౌండేషన్ ద్వారా విభిన్న సేవా కార్యక్రమాలు చేస్తూ మానవత్వం చాటుకుంటున్నారు. అందులో భాగంగానే మహాప్రస్థానం ఉచిత సేవ కోసం మరొక నూతన వాహనాన్ని శుక్రవారం అందుబాటులోకి తీసుకువచ్చారు. మొత్తం మూడు వాహనాల ద్వారా జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ, వీరులపాడు, జొన్నలగడ్డ, కంచికచర్ల, విజయవాడ వరకు ఉచితంగా మహాప్రస్థాన వాహన సేవలను విస్తరింప చేశారు. ఉచిత మహాప్రస్థానం వాహనం సేవలకు 9010009111 నెంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

నౌకాదళ ఉద్యోగాలపై అవగాహన

ప్రజాశక్తి - తిరువూరు : స్థానిక శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సర విద్యను అభ్యసిస్తున్న మెకానికల్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విద్యార్థులకు వ్యాపార నౌకాదళంలో ఉన్న ఉద్యోగ అవకాశాలపై సింగపూర్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్ మేనేజ్‌మెంట్ రాజ్‌కుమార్ శుక్రవారం అవగాహన కల్పించారు. నేవీ నౌకాదళంలో ఉద్యోగాలు పొందడానికి కావలసిన మెలకువలు, నైపుణ్యతను గూర్చి వివరిస్తూ మెరైన్ ఇంజనీర్‌గా మీరు వివిధ నౌకల్లోని యంత్రాల నిర్వహణ, కార్యకలాపాల సామర్థ్యాన్ని, సిబ్బంది భద్రత, పర్యావరణ బాధ్యతను నిర్ధారించడం వంటివి ఉంటాయని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు, ఎంహెచ్‌ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : వీడు రోడ్డు సేఫ్టీ ఎన్జీవో డైరెక్టర్ వాసు ఆధ్వర్యంలో క్రాంతి హైస్కూల్‌లో 7,8,9 తరగతి విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పాదచారులు రోడ్డును దాటేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, రోడ్డును క్రాస్ చేసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయం తెలిపారు. సేఫ్ సైక్లింగ్ గురించి విద్యార్థులకు ప్రాక్టికల్‌గా కొన్ని విషయాలు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో విద్యార్థుల పాత్ర ఏమిటి అనే విషయాన్ని తెలిపారు. సైకిల్ తొక్కేటప్పుడు చేతి సైగల ద్వారా మన కదలికలు వారికి ఎలా తెలియజేయాలి అనే విషయాన్ని వివరించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులకు హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించారు. విద్యార్థులకు రోడ్డు భద్రతకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించి వారిని ప్రశ్నలు అడిగి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్ వై.జమలయ్య, క్రాంతి హైస్కూల్ కరస్పాండెంట్ వి.మురళీమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా ఫ్యామిలీ ఫెస్ట్

మాట్లాడుతున్న లావణ్య

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం ఫ్యామిలీ ఫెస్ట్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫ్యామిలీ ఫేస్ట్, ఫ్యామిలీ ఇస్ ద ఫస్ట్ ప్రోగ్రాంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కె.లావణ్య మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు ముందు తరాలకు అందించాలంటే తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుండే కుటుంబ పెద్దలపై, బంధుమిత్రులపై ప్రేమానురాగాలు, ఉపాధ్యాయులపై గౌరవం పెంచాలని సూచించారు. అనంతరం విద్యార్థులుచే తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇజిఎం మురళి కృష్ణ, ఆర్ఐ టి.వినోద్, డీన్ వి.కష్ణ, ప్రైమరీ ఇన్చార్జి ఝాన్సీ, ప్రీ ప్రైమరీ ఇన్చార్జి లిల్లీ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హామీ ఇచ్చి మాట తప్పారు

మాట్లాడుతున్న నెట్టెం రఘురాం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఏడాదికి రూ.5 లక్షల చొప్పున మొత్తం 25 లక్షల ఇళ్ల నిర్మించి ఉచితంగా ఇస్తానని హామీ నిచ్చి సిఎం జగన్ రెడ్డి మాట తప్పి మడమ తిప్పారని విజయవాడ పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు నెట్టెం రఘురాం ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ ఇళ్ల పేరుతో డ్వాక్రా మహిళలు ఒక్కొక్కరి పేరుతో రూ.35 వేలు చొప్పున మొత్తం రూ.3,866 కోట్లు అప్పులు తెచ్చి మహిళల నెత్తిన వేల కోట్లు అప్పులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడ్కో ఇళ్లను తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లు అప్పు రెండేళ్ల రుణకాల పరిమితి చెల్లించకపోవడంతో బ్యాంకులు నేరుగా లబ్దిదారులకే నోటీసులు ఇస్తున్నారని, తెచ్చిన అప్పులు ఏమయ్యాయో జగన్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కో కన్వీనర్ ముల్లంగి రామకష్ణారెడ్డి, నూజివీడు నియోజకవర్గ రాష్ట్ర పరిశీలకుడు గింజుపల్లి రమేష్, జగ్గయ్యపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, జగ్గయ్యపేట తెలుగు మహిళా అధ్యక్షురాలు, కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సిలువగిరి మహోత్సవాలు

మాట్లాడుతున్న ఎంఎల్‌సి అరుణ్‌కుమార్

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణ సిలువ గిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవాల్లో ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ పాల్గొన్నారు. సిలువ గిరి పుణ్యక్షేత్ర మహోత్సవాల నిర్వహణకు సొంత నిధులు రూ.50 వేలు విరాళంగా అందించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సోదరులకు కతజ్ఞతలు తెలిపారు. సిలువగిరిలో నీటి సమస్య ఉందని క్రైస్తవ సోదరులు తమ దృష్టికి తీసుకువచ్చారు. వారం రోజుల్లోపు నీటి సరఫరా కల్పించేలా చర్యలు చేపడతామన్నారు. సిలువ గిరి కొండపై గల చర్చి వరకు బీటీ రోడ్డు ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. ఎమ్మెల్సీకి ప్రత్యేక కతజ్ఞతలు తెలిపి, శాలువాలతో మరియానివాస్ ఫాదర్లు, క్రైస్తవ పెద్దలు, క్రైస్తవ సోదరులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, క్రైస్తవ మత పెద్దలు, పలువురు పాస్టర్లు, పెద్ద ఎత్తున క్రైస్తవ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నియంత్రించే వరకు పోరాటం

కాలుష్యంపై చర్చిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ అధికారులు కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టే వరకు తమ పోరాటం ఆగదని డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ కాలుష్య నియంత్రణ ప్రజా పోరాట సమితి సభ్యులు తెలిపారు. శుక్రవారం రాత్రి సభ్యులను చర్చలకు పిలిచినట్టుగా వారు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి స్వచ్ఛమైన నీరు మా ప్రాంత ప్రాథమిక హక్కు అనే నినాదంతో కాలుష్య నియంత్రణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళుతున్నట్టు తెలిపారు. ఇప్పటికే కాలుష్య ప్రభావితం గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేసినట్టు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ అధికారుల ద్వారా మేనేజింగ్ డైరెక్టర్ దృష్టికి ఈ ప్రాంతంలో పగలు రాత్రి తేడా లేకుండా పొగ మంచువలె బూడిద వర్షంగా ఉంటుందన్నారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థాలను నేరుగా కృష్ణానదిలో కలుపుతూ తద్వారా తాగునీరు కలుషితం చేస్తూ శుద్ధి చేయడానికి వీల్లేనంత బూడిదను కృష్ణానదిలో కలపడం వలన కృష్ణానది పరివాహ ప్రాంతాలు కలుషితనీరు తాగే అనారోగ్య బారిన పడుతున్న అంశాల వారి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ముఖ్యంగా 30 సంవత్సరాల పైబడిన వైటిపిఎస్ యూనిట్లైనా ఒకటి రెండు యూనిట్లను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. ఎన్ టి టి పి ఎస్ చుట్టుపక్కల పరిసర ప్రాంత గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలి తక్షణమే కొండపల్లి మున్సిపాలిటీ ప్రభుత్వ స్థలంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి. బూడిద కాలుష్యం వల్ల పచ్చని చెట్లు కనుమరుగుతున్నాయి పరిసర ప్రాంతాన్ని చెట్లు నాటి హరిత ప్రదేశాలుగా చేయాలని పలు డిమాండ్లను వారి ముందుంచినట్లు సభ్యులు తెలిపారు. ముందుగా బూడిద డంపింగ్ యార్డ్‌లు ఎక్కడా లేకుండా చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. మిగతా డిమాండ్లను మేనేజింగ్ డైరెక్టర్‌తో చర్చించిన అనంతరం మరల సాధ్యాసాధ్యాలు పరిశీలించి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టకుండా తూతూ మంత్రంగా కాలయాపన చేస్తే మా పోరాటం ఇంకా ఉధృతం చేస్తామని పోరాట సమితి సభ్యులు తెలిపారు. చర్చల్లో పాల్గొన్న వాళ్లు చెరుకుమల్లి సురేష్, కరిముల్లా, హైదర్, భద్ర, రాజేంద్ర, సుబ్రహ్మణ్యం, భవాని, మాధురి ఇతర పోరాట సభ్యులు ఉన్నారు.

టిడిపి, జనసేన కార్యకర్తల్లో జోష్ లేదు

ప్రజాశక్తి - భవానీపురం : టిడిపి, జనసేన కార్యకర్తల్లో జోష్ నింప లేక పోయారనీ వైసిపి రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ అన్నారు. తాడేపల్లిగూడెంలో జరిగిన టిడిపి కూటమి జెండా బహిరంగ సభకు ఆశించినంతగా జనం రాకపోవడం వల్ల నాయకులు నిరుత్సాహంతో నోరు అదుపుతప్పి ఆత్మ స్తుతి పరనిందగా మాట్లాడారన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. వేదిక మీద కూర్చున్న నాయకులు పవన్ కళ్యాణ్, చంద్రబాబు మాట్లాడుతున్న భాషను చూసి విస్మయానికి గురయ్యారన్నారు. కేవలం 30 వేల మంది పట్టే సభా స్థలంలో బస్సులు కార్లలో తరలించినా పది హేను వేల మంది కూడా రాలేక పోయారనీ ఆకుల విమర్శించారు.

రోడ్లు, డ్రైయిన్లు, పైపులైన్లు ప్రారంభించిన సామినేని

రోడ్లు, డ్రైయిన్లు ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని శుక్రవారం 31 వార్డులలో గడిచిన రెండేళ్లలో సుమారు 27 కోట్ల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి పైపులైన్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను, యువనాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రోడ్లు, డ్రెయిన్లు, సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం తదితర పనులతో పట్టణాన్ని అభివద్ధి పథం వైపు నడిపిస్తున్నామని చెప్పారు.

'బిసిల తరుపున పోటీ చేస్తా'

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మైలవరం నియోజకవర్గంలో టిడిపి తరపున బిసిలకు సీటు కేటాయించాలని, అధిష్టానం ఆదేశిస్తే బిసిల తరుపున తాను పోటీలో నిలబడ తానంటూ కొండపల్లి 17వ వార్డు మున్సిపాలిటీ కౌన్సిలర్ ముప్పసాని భూలక్ష్మి గతంలో తెలిపారు. ఎస్‌టి కాలనీలోని ఆర్‌సిఎమ్ సంఘం వారిని కలిసి వారి మద్దతు కోరారు.

బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఇంటి వద్ద నుండి భారీ ర్యాలీతో 31 వార్డుల్లో జగ్గయ్యపేట పట్టణంలోని 27 కోట్ల రూపాయలతో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ సర్దార్ సామినేని ఉదయభాను, సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో వందలాది బైకులతో జగ్గయ్యపేట పట్టణంలో వైసిపి నాయకులు ర్యాలీ నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మైలవరం : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మైలవరంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చంద్రగూడెం గ్రామానికి చెందిన మందా రమేష్ (29) ద్విచక్ర వాహనంపై మైలవరం వస్తున్నాడు. సబ్జపాడు క్రాస్ రోడ్ వద్ద మరో వాహనాన్ని దాటేందుకు ప్రయత్నించగా రహదారి పక్కన ఉన్న బడ్డీ కొట్టుకు ఢీకొనడంతో కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం బంధువులకు అప్పచెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ.హరి ప్రసాద్ తెలిపారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి- నందిగామ : 2023-24ఆర్థిక సంవత్సరము యొక్క ఆస్థి పన్ను, భవనాలు ఖాళీ స్థలం పన్నులు ఏకమొత్తంగా మార్చి 31లోపు చెల్లించి వడ్డీ మినహాయింపు పొందాలని నందిగామ మున్సిపల్ కమిషనర్ హేమమాలిని శుక్రవారం తెలిపారు. నీటి కుళాయి పన్నులు కూడా చెల్లించాలని కోరారు. ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా నందిగామ పురపాలక సంఘ కార్యాలయంలో గల పురసేవ కౌంటర్‌లో అన్నిరకాల పన్నులు కట్టించుకోనున్నట్లు తెలిపారు. పన్నులు కట్టించుకొనే వేళలు ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9:00 వరకు అని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గన్నవరం నుంచి ప్రధాన ప్రాంతాలకు కనెక్టివిటీ అవసరం

ఎయిర్‌పోర్టు డైరెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి

మాట్లాడుతున్న లక్ష్మీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-గన్నవరం: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్‌తో ఏపి ఛాంబర్స్ ఇంటరాక్టివ్ సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత రెడ్డి హాజరయ్యారు. కొత్త టెర్మినల్ స్థితిగతులు, తాజా పరిణామాలు, ప్రయాణికుల సమస్యలను చర్చించారు. ఈ సందర్భంగా ఏపి ఛాంబర్స్ అధ్యక్షుడు పోటూరి భాస్కరరావు మాట్లాడుతూ ఏపీ ఛాంబర్స్ రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనలో చురుగ్గా పాల్గొంటుందన్నారు. విమానాశ్రయాలు, ఓడరేవులు, పారిశ్రామిక కారిడార్లు తదితరాల అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇస్తోందన్నారు. గతంలో విజయవాడ విమానాశ్రయం నుంచి 62 విమానాలు నడిచేవని, ఇప్పుడు 42కి తగ్గాయని చెప్పారు. ఎయిర్‌పోర్టు ఆధునీకరణకు కూడా సమయం పడుతోందన్నారు. ముంబై, వారణాసి, కోల్‌కోటా, అహ్మదాబాద్ వంటి ప్రధాన ప్రాంతాలకు నేరుగా కనెక్టివిటీ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. 2017లో విజయవాడ విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా వచ్చినప్పటికీ అంతర్జాతీయ కనెక్టివిటీ తక్కువగా ఉంది. అనంతరం లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా యాజమాన్యంలో ఉన్నందున, విమానాశ్రయంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కొత్త టెర్మినల్ 2019లో ఆమోదించబడిందని, ఈ ఏడాది చివరి నాటికి పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. కొత్త ఆపరేటర్‌కు ఎయిర్ కార్గో నిర్వహణకు లైసెన్స్ మంజూరు చేసి ఔట్‌బౌండ్ కార్గో ప్రారంభిస్తామన్నారు. డిమాండ్ దృష్ట్యా న్యూఢిల్లీకి మరో రెండు విమానాలను ప్రారంభించవచ్చని, ముంబైకి నేరుగా విమానాన్ని నడపవచ్చని ఆయన అన్నారు.

వినతిపత్రం ఇస్తున్న టిడిపి నాయకులు

ఓటర్ల జాబితాపై సమావేశం

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం నియోజకవర్గ అసిస్టెంట్ ఎన్నికల నమోదు అధికారి, గన్నవరం తహసీల్దార్ ఎన్.ఎస్ పవన్ కుమార్ అధ్యక్షతన నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల మార్పు ప్రతిపాదనలు, ఓటరు దరఖాస్తు జాబితా వివరాలపై చర్చించారు. అనంతరం గన్నవరం నియోజకవర్గ టిడిపి పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ భవనాలకు వైసిపి రంగులు వేసి ఉన్నాయని, వాటిని వెంటనే తొలగించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గత నెల 22వ తేదీ నుంచి ఇప్పటివరకు క్లెయిములు పరిష్కరించిన తర్వాత నియోజకవర్గ వ్యాప్తంగా 2,79,494 మంది ఓటర్లు ఉన్నారని, గత జాబితాకు అదనంగా 229 మంది నూతన ఓటర్లుగా నమోదు చేసుకోబడ్డారని, దీని ప్రకారం విజయవాడ రూరల్ మండలంలో 88,576 మంది, గన్నవరం మండలంలో 74,232 మంది, బాపులపాడు మండలంలో 72,601 మంది, ఉంగుటూరు మండలంలో 44,085 మంది ఓటర్లుగా ఉన్నారని చెప్పారు. ఫిబ్రవరి 2 నాటి తాజా సవరణలో నియోజకవర్గ వ్యాప్తంగా 1,379 మంది మృత ఓటర్ల తొలగింపునకు ఆమోదించామన్నారు. గన్నవరం మండలానికి సంబంధించి 11 పోలింగ్ కేంద్రాలు బాపులుపాడు మండలానికి సంబంధించి 24 పోలింగ్ కేంద్రాలు, ఉంగుటూరు మండలానికి సంబంధించి 25 పోలింగ్ కేంద్రాలు, విజయవాడ రూరల్ సంబంధించి 6 పోలింగ్ కేంద్రాలలో సాంకేతిక పరమైన పేరు,దిక్కులు మార్పునకు ప్రతిపాదనలు సమర్పించినట్లు సమావేశం దష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో విధివిధ రాజకీయ పార్టీలకు ప్రతినిధులు సుంకర వీరభద్ర ప్రసాద్ (ఐఎన్‌సి), నీలం ప్రవీణ్‌కుమార్ (వైసిపి), కైలే యేసుపాదం (సిపిఎం), తంగిరాల శ్రీనివాసరావు (టిడిపి), ఆర్ వెంకటేశ్వరరావు (వైసిపి), డిప్యూటీ తహసిల్దార్ గోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

39 మందికి జరిమానా

ప్రజాశక్తి-విజయవాడ: స్థానిక 5వ ట్రాఫిక్ పోలీసు వారు మొత్తం 39 కేసులలో మద్యం సేవించి వాహనాలు నడిపిన చోదకులను ఆరో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్ట్ లో శుక్రవారం ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి జి.లెనిన్‌బాబు తొమ్మిది మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున, మిగిలిన 30 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించడం జరిగింది.ప్రతి రోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని, వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా హెచ్చరించారు.

పిల్లల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు : కృష్ణదొర

ప్రజాశక్తి-గుడివాడ

పిల్లలకు పౌష్టికాహారం ఇస్తూ ఉండాలని, పిల్లల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకూడదని ప్రభుత్వాసుపత్రి ఆర్ఎంఒ కృష్ణదొర సూచించారు. గుడివాడ సిఐటియు కార్యాలయంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సామాజిక ఆశయ సాధికార సేవ ఆధ్వర్యంలో శుక్రవారం చింతా సువర్ణరాజు తన తల్లి అమృత జ్ఞాపకార్థం 30 మంది కుటుంబాలకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ విజయ, కంచర్ల మహేష్, సిహెచ్ జోషి, రాజేష్, గోవర్ధన్, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ ఎం కోటేశ్వరమ్మ, జె చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎంఒ కృష్ణదొర

సంతూర్ షవర్ జెల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: విప్రో కన్స్యూమర్ కేర్ నుండి సహజ గుణాలు గల విలాసవంతమైన సంతూర్ షవర్ జెల్‌ను విజయవాడ మార్కెట్లోకి విడుదల చేసినట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్ ఎం.ఎస్.ఆర్.ప్రసాద్ తెలిపారు. నగరంలోని విప్రో కేర్ రీజనల్ కార్యాలయం నందు నూతన ఉత్పత్తుల పరిచయ కార్యక్రమం శుక్రవారం ఉదయం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టాయిలెట్ సోప్ బ్రాండ్ సంతూర్ దాని ఎక్స్‌టెన్షన్ కేటగిరి కింద షవర్ జెల్‌ను విడుదల చేసినట్లు తెలిపారు. మూడు ప్రత్యేకమైన వేరియంట్‌లలో లభ్యమవుతుందని తెలిపారు. చర్మాన్ని రిఫ్రెష్ చేయడానికి ఈఉత్పత్తులు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. కంకుమపువ్వు, మేరిగోల్డ్ ప్రకాశవంతమైన చర్మం కోసం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.

వ్యాపారులకు 'ఆలిస్ బ్లూ' తోడ్పాటు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: వ్యాపార వర్గాలకు సహాయం చేయడానికి ఆలిస్ బ్లూ వెబ్‌నార్లు పోర్ట్‌ఫోలియో సేవల వంటి వనరులను అందిస్తుందనీ ఆ సంస్థ ఆర్థిక నిపుణులు కె.రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిఫ్టీ సరికొత్త మైలురాయిని చేరుకుందన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 22న నిఫ్టీ 22,252.5 ఆల్ టైం గరిష్ట స్థాయిని చేరుకొని కొత్త మైలు రాయిని నమోదు చేసి, 22,217.45 వద్ద ముగియటంతో పెట్టుబడిదారులు తదుపరి కదలిక గురించి యోచిస్తున్నారన్నారు. రాబోయే ఏప్రిల్ లేదా మే నెలలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మార్కెట్ కొత్త విధానాలు ఎంచుకుంటున్నారు. ఆలిస్ బ్లూ ఈ మార్కెట్‌ను బాగా అధ్యయనం చేసి వ్యాపారులకు అవసరమైన సేవలు అందిస్తుందన్నారు. స్టాక్ ను ఎంపిక చేసేటప్పుడు, మార్కెట్ గరిష్ట స్థాయికి చేరినపుడు, లాభాలను కాపాడుకోవటానికి సరియైన వ్యూహం అవసరం ఉంటుందన్నారు. పెట్టుబడిని రీకక్యాలిబ్రేట్ చేయుటకు ఆధునిక ఫైనాన్సియల్ విధానాలు అనుసరిస్తూ ఆలిస్ బ్లూ అనేక అదనపు ఫీచర్లతో వారికి మద్దతు అందిస్తుందనీ తెలిపారు.

దేవరాయలుకు సన్మానం

ప్రజాశక్తి-చల్లపల్లి: ఎన్టీఆర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు దోవారి దేవరాయలును శుక్రవారం పార్కులో ఘనంగా సన్మానించారు. ప్రతినెలా ఒకటో తేదీన జరిగే సన్మాన కార్యక్రమంలో భాగంగా వాకర్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు దేవరాయలును శాలువాలు, పూలమాలలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఉపాధ్యులు తాతారావు, కైతేపల్లి దాస్, విశ్రాంత ఏఈ అంబటి బసవ శంకర్రావు, విశ్రాంత లైన్‌మెన్ ఉప్పాల సాంబశివరావు, న్యాయవాది కొల్లూరి రామాంజనేయులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి తొమ్మిది గంటలు విద్యుత్

ప్రజాశక్తి-విజయవాడ: ఉమ్మడి కృష్ణాజిల్లాలోని వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ఈ నెల 2వ తేదీ నుంచి పగటి పూట ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తొమ్మిది గంటల పాటు నిరంతరాయంగా ఒక స్పెల్‌లోనే విద్యుత్ సరఫరా చేయబడుతుందని విజయవాడ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఇ ఎ.మురళీమోహన్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ...వ్యవసాయ విద్యుత్ వినియోగదారుల సదుపాయం కోసం విద్యుత్ శాఖ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. దీనిని రైతులందరూ గమనించి వినియోగించుకోవాలని కోరారు.

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఆటోనగర్‌లో 21 రోజుల క్షయ వ్యాధి అవగాహనా శిబిరాలను జిల్లా క్షయ వ్యాధి నియంత్రణా సమన్వయకర్త సిహెచ్.దినేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోనగర్ కార్మికులు ఆరోగ్యం కొరకు వాసవ్య మహిళా మండలి క్షయపై అవగాహనా శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. క్షయవ్యాధి లక్షణాలైన రెండు వారాలకు మించి దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు కోల్పోవడం, తరచూ జ్వరం రావడంలో ఏఒక్కటి ఉన్నా ఆలస్యం చేయకుండా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గవర్నమెంటు ఆసుపత్రికి వెళ్లి పరీక్ష చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ కె.శ్రీనివాసరావు ఉమామహేశ్వరరావు, సీనియర్ ట్రీట్ మెంట్ సూపర్వైజర్ సత్యప్రసాద్, యం.అజయ్ బాబు, మహాలక్ష్మి, వీరాంజనేయులు పీర్ ఎడ్యుకేటర్లు పాల్గొన్నారు.

రూ.200 కోట్లతో తాగునీటి ప్రాజెక్టులు : కొడాలి నాని

ప్రజాశక్తి-గుడివాడ (నందివాడ): నందివాడలో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.200 కోట్లతో తాగునీటి ప్రాజెక్టులు నిర్మితమవుతున్నాయని, ఈ ప్రాజెక్టుల ద్వారా చేపల చెరువులతో నిండిన నందివాడ, గుడివాడ రూరల్ మండలాల్లో తాగునీటి సమస్య ఉండదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. గురువారం రాత్రి నందివాడ మండలం తమిరిశ గ్రామంలో జరిగిన 'సిద్ధం' సభలో ఆయన మాట్లాడుతూ 14 ఏళ్లు సిఎంగా ఉన్న చంద్రబాబు, ఐదేళ్లు మద్దతుగా ఉన్న పవన్ ప్రజల కోసం ఏం చేశారో చెప్పాలన్నారు. అనంతరం తమిరిశ గ్రామ పరిధిలోని 312 మంది ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వాలంటీర్లను ఎమ్మెల్యే నాని సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, ఎంపీపి పెయ్యల ఆదాం, ఎంపిటీసీ పిళ్లా మాణిక్యం, సర్పంచ్ తప్పిట ధనలక్ష్మి, తమిరిశ వైసిపి అధ్యక్షులు తప్పిట సలోమాన్, గుడివాడ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను, రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కొండపల్లి కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్లస్థలాల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

వైసిపిలో మైనార్టీలకు పదవులు

మాట్లాడుతున్న ఆసిఫ్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీలను అనేక పదవులతో గౌరవిస్తున్నారని వైసిపి పశ్చిమ ఇన్‌ఛార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. ఈ రోజు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలలో వైసిపి పశ్చిమ ఇన్‌ఛార్జి షేక్ ఆసిఫ్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మెన్ షేక్ గౌస్ మొహిద్దిన్‌తో పాటు స్వాతి సెంటర్‌లోని రజా మసీదులో పాల్గొన్నారు. స్థానిక ముస్లిం పెద్దలు షేక్ ఆసిఫ్‌ను, వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దిన్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ విదేశీ విద్య షాదీ ముబారక్ఫీజు రీయింబర్స్‌మెంట్, మైనారిటీలకు రాజ్యాధికారం దిశగా నడిపిస్తున్న సిఎం జగన్ తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చారని మైనారిటీ సోదరులందరూ తనకు అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం గౌస్ మొహిద్దిన్ మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎమ్‌డి ఇర్ఫాన్, బాజీబాబా, అప్సర్ రసూల్ ఖాన్, షేక్ కలీం, అబ్దుల్ రఫి, షేక్ గౌసి, కరిముల్ల, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరం అభ్యర్థి మార్పు ఉండదు : ఎంపి కేశినేని

వైసిపి కార్యాలయంలో కేశినేని నాని

ప్రజాశక్తి - మైలవరం : స్వచ్ఛమైన వైట్ పేపర్ లాంటి వ్యక్తి స్వర్ణాల తిరుపతిరావు అని త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మైలవరం నియోజక వర్గానికి సంబంధించి అభ్యర్థి విషయంలో ఎలాంటి మార్పులు ఉండవని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని నాని స్పష్టం చేశారు. స్థానిక నూజివీడు రోడ్‌లో నూతన వైసిపి కార్యాలయం ఏర్పాటు పనులను నియోజకవర్గ ఇన్చార్జి స్వర్ణాల తిరుపతిరావుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీట్ విషయంలో ఎలాంటి అపోహలులేవని సర్నాల తిరుపతిరావు యాదవ్ 20 వేలకు పైగా మెజార్టీతో గెలుస్తారన్నారు. సోషల్ ఇంజనీరింగ్ ద్వారా రాజ్యాధికారం అనేది ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు ఉండాలని సిఎం జగన్ కోరుకుంటున్నారని అందుకనే ఆ వర్గాల వారికి ఎక్కువగా సీట్లు కేటాయిస్తున్నారు. దేశంలోనే సోషల్ ఇంజనీరింగ్‌లో వైసిపి మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ నెల ఆరో తేదీన కార్యకర్తల ఆత్మీయ సమావేశంతో పాటు కార్యాలయాన్ని కూడా ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి, ఉప సర్పంచ్ సీతారామరెడ్డి, ఎన్‌డిపి బ్రదర్స్ స్థానిక వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

ధర్నాలో పాల్గొన్న కార్మికులు

కార్మిక సంక్షేమ బోర్డును కొనసాగించాలని ధర్నా

ప్రజాశక్తి - విసన్నపేట : కార్మిక సంక్షేమ బోర్డును కొనసాగించాలని కార్మికులకు రావాల్సిన క్లైములు ఇవ్వాలని కోరుతూ కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్ యూనియన్ పిలుపులో భాగంగా విస్సన్నపేట గాంధీ బొమ్మ సెంటర్లో ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ ఏడు సంవత్సరాల నుండి గత ప్రభుత్వం అయితేనేమి ప్రస్తుత ప్రభుత్వం అయితే నేమి కార్మిక సంక్షేమ బోర్డును పట్టించుకోలేదని, కార్మికులకు రావాల్సిన సంక్షేమ పథకాలను నిలిపివేశారని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంక్షేమ బోర్డును కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు కెవిపిఎస్ జిల్లా నాయకులు మేకల జ్ఞాన రత్నం విస్సన్నపేట మండలం తాపీ యూనియన్ ప్రెసిడెంట్ మర్రిబోయిన అప్పారావు సెక్రెటరీ పోతురాజు శ్రీనివాస రావు గౌరవ అధ్యక్షులు గంజిని పోయిన రాము సగుర్తి శ్రీనివాస రావు రైతు సంఘం మండల నాయకులు పులిబల్ల ఏడు కొండలు సిఐటియు మండల సెక్రెటరీ షేక్ బాషా కార్మికులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



మైలవరంలో నెంబర్లు చూస్తుంటూ...

మైలవరంలో...

విస్సన్నపేట పరీక్షా కేంద్రంలో...

ప్రజాశక్తి - మైలవరం : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మైలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనరల్‌కు సంబంధించి 123 మందికి 6, ఒకేషనల్‌లో 92కి 5, లిటిల్ ఫ్లవర్‌లో 141కి 2, ఎస్‌విఆర్‌జిఎన్‌ఆర్ జూనియర్ కళాశాలలో 146కి2 ఆబ్సెంట్ అయినట్లు ఆయా కళాశాలల ఎగ్జామ్స్ చీఫ్ సూపరింటెండెంట్ తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సిఐ కిషోర్ బాబు, ఎస్ఐ హరిప్రసాదులు పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి పరిశీలించారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు మంచినీరు, ఫస్ట్ ఎయిడ్, ఆరోగ్య సిబ్బంది మూడు పరీక్ష కేంద్రాల వద్ద ఉన్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు ముందస్తుగా తీసుకున్నారు. **విస్సన్నపేట :** విసన్నపేటలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా డికెఎంపి కళాశాల నుండి 378 మంది విద్యార్థులు హాజరవగా 14 మంది గైర్హాజరయ్యారు. శ్రీశ్రీ కళాశాల నుండి 399 మంది హాజరవగా 16 మంది గైర్హాజరయ్యారు. వికాస్ కాలేజ్ నుండి 575 మంది హాజరవగా 15 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ కళాశాల నుంచి 265 మంది హాజరయ్యారవగా 10 మంది గైర్హాజరయ్యారని ఆయా కళాశాలల అధినేతలు తెలిపారు. **తిరువూరు :** ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు మొత్తం విద్యార్థులు 1117 మంది విద్యార్థులకు గానూ 1081 మంది హాజరు కాగా, 36 మంది గైర్హా జరైనట్లు కస్టోడియన్ సిద్ధయ్య తెలిపారు. నాగార్జున కాలేజీలో 309 మంది విద్యార్థులను కేటాయించగా 300 మంది హాజరయ్యారు. ప్రభుత్వ జూని యర్ కళాశాలలో 317కి గానూ 298, ఏపీఎస్డబ్ల్యూఆర్జేసీలో 246 గాను 241, శ్రీనిధి జూనియర్ కాలేజీలో 245 మంది విద్యార్థులకు గానూ 242 మంది హాజరైనట్లు ఆయన వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని, మాస్ కాపీయింగ్ జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారని, పరీక్షా కేంద్రాలలోకి సెల్ ఫోన్లు కూడా అనుమతి లేదని సిద్ధయ్య పేర్కొన్నారు. **కంచికచర్ల :** మండలానికి సంబంధించి మొత్తం నాలుగు సెంటర్లలో పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 938 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 56 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా 882 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. స్థానిక ఇమాక్యులేట్ కళాశాలలో 162 మంది విద్యార్థులకు 157 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎన్‌టిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 180 మంది విద్యార్థులకు, 150 మంది పరీక్షలు రాయగా, 30 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. దీక్ష జూనియర్ కళాశాలలో 250 మంది విద్యార్థులకుగానూ, 241 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 9 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కీసర బిజెపి కళాశాలలో 346 మందికి 334 మంది పరీక్షలు రాయగా, 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షల సందర్భంగా సంబంధిత అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.

బాల్యవివాహాలపై అవగాహన

బహుమతులందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - మైలవరం : మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలోని విద్యార్థినులకు శుక్రవారం విద్యా ప్రాముఖ్యత, ఆరోగ్యం, బాల్యవివాహాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎటు ఎల్లిండు ఈ సందర్భంగా నార్త్ సౌత్ ఫౌండేషన్ లైజిన్, మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ గౌరవ సలహాదారు మేక శ్రీలత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని, తద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని అన్నారు. పదో తరగతి విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిసా ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధా, సిసిఇహెచ్‌డి ఆన్లైన్ బిజినెస్ లీడర్ ప్రొఫెసర్ శ్రీనివాస్, జి.నాగిరెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, వార్డెన్ దీప, ట్రస్టు సభ్యులు మాధవి, కవిత, నాగమణి తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు :** బాల్య వివాహాలు నిరోధించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తిరువూరు సర్వోదయ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మూర్తి అన్నారు. పాఠశాలలో ఐడియాస్ సేవా సంస్థ అధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధక చట్టం అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ డే కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ఐడియాస్ సేవా సంస్థ డైరెక్టర్ శౌరి అందించారు. ఈ కార్యక్రమంలో ఐడియాస్ డైరెక్టర్ అవ్వారి శౌరి, కోకీలంపాడు స్కూల్ ప్రధానోపాధ్యాయులు గుప్తా, పాల్గొన్నారు.

నూతన పాలక మండలి సభ్యులు

దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం దేవస్థానం ప్రాంగణంలో ఘనంగా జరిగింది. శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం నూతన పాలకమండలి చైర్మన్‌గా వంశపారంపల్లి ధర్మకర్త నందిపాటి శ్రీనివాసరావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ధర్మకర్తలుగా చలమలశెట్టి జగదీష్, అయితా మాణిక్యాల రావు, పోతిన గాయత్రి, యలమంచిలి భవాని, పువ్వుల తులసి, గుర్రం బేబీ స్వప్న ప్రమాణ స్వీకారం చేశారు. నూతన పాలకమండలి ఎక్స్ అఫీషియో సభ్యునిగా విన్నకోట శ్రీనివాసరావు శర్మ ప్రమాణస్వీకారం చేశారు. ఇఒ వెంకటేశ్వర రావు నూతన పాలకమండలి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైసిపి పశ్చిమ సమన్వయకర్త షేక్ ఆసిఫ్, కార్పొరేటర్లు అత్తులూరి ఆదిలక్ష్మి పెదబాబు, మరుపిళ్ళ రాజేష్ నూతన పాలక మండలిని అభినందించారు.

టెన్త్ మోడల్ పరీక్ష



అధిక మార్కులు సాధించిన వారికి బహుమతులిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి కంచికచర్ల : ఈ ఏడాది ఏప్రిల్‌లో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు అధిక మార్కులు సాధించాలని ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జి.గోపి నాయక్ అన్నారు. ఇటీవల కంచికచర్లలో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పదోతరగతి మోడల్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన మొదటి ముగ్గురు విజేతలకు శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యం పెట్టుకొని ముందుకు వెళ్లాలని విద్యారంగంలో వస్తున్న మార్పులను గమనించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కంచికచర్ల యుటిఎఫ్ నాయకులు పుల్లారావు మాట్లాడుతూ ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో విద్య ఎంతో కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కంచికచర్ల మండల కార్యదర్శి షేక్ జాహిదా, మండల అధ్యక్షుడు మాధవ్, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రేమ్ కుమార్, గోపి, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

మహాశతావధానం ఏర్పాటు హర్షణీయం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఈ అధునాతన కాలంలో సౌందర్యలహరీ మహా శతావధానం వంటి కార్యక్రమాలు ఏర్పాటు హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గా ప్రసాదరావు అన్నారు. శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి, విజయవాడ వారి ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 4 రోజులు నుండి శ్రీదుర్గా సౌందర్యలహరి మహాశతావధానం ఐదో రోజుకు చేరింది. ముఖ్యఅతిథిగా దుర్గాప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుట్టపర్తి వారి శివ తాండవం గానం చేయాలని జస్టిస్ దుర్గా ప్రసాదరావు కోరగా, జనరంజకంగా అవధాని గానం చేశారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామరావు మాట్లాడుతూ శ్రీ దుర్గా మల్లేశ్వరుల సన్నిధి సంగీత, సాహిత్య, పద్య, అవధాన ప్రక్రియలకు నెలవై యుండాలని భావించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ప్రకారం ఈ మహోన్నత కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. డాక్టర్ నాగ ఫణి శర్మ మాట్లాడారు. అవధానిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు చింతా శ్రీనివాస్, చింతా సింహాచలం (చిన్నా) పాల్గొన్నారు.

వీధి కుక్కలను నియంత్రించాలి

కుక్క కరిచిన మహిళను పరామర్శిస్తున్న సత్యబాబు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : వీధికుక్కల బారి నుండి ప్రజలను కాపాడాలని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు కోరారు. ఒక మహిళను శుక్రవారం వీధి కుక్క గాయపరిచింది. వెంటనే మున్సిపల్ శాఖ అధికారులకు ఫోన్ ద్వారా విషయాన్ని తెలిపారు. వీధి కుక్కల నియంత్రణలో నగర పాలక సంస్థ పాలకులకు చిత్తశుద్ధి లోపించిందని వారి చేతకానితనానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారని మండిపడ్డారు. కౌన్సిల్‌లో ఈ అంశంపై మేయర్, కమిషనర్ దృష్టికి ఎజెండాలో ప్రతిపాదించి తెలిపినట్లు చెప్పారు.

పల్స్‌పోలియోపై అవగాహన

ప్రజాశక్తి - అజిత్ సింగ్ నగర్ : మండలంలో మార్చి 3వ తేదీ ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని ఎంపిడిఒ అద్దంకి శ్రీ రమ్య, పిహెచ్‌సి వైద్య అధికారి ఎ.మాధురి దేవి డాక్టర్ విజయ డాక్టర్ నిరంజన్ కార్యాలయంలో శుక్రవారం పల్స్ పోలియోపై జరిగిన అవగాహన కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ ఇప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుండి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించడానికి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. 34 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి 8,884 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఆ రోజు పోలియో చుక్కలు వేయించుకొని పిల్లలకు 4, 5 తేదీలలో సిబ్బంది ఇళ్లకు వెళ్లి వేస్తారన్నారు.

పాడి రైతుల అభివృద్ధికి కృషి: చలసాని

బంగారునాణేన్ని అందజేస్తున్న చలసాని ఆంజనేయులు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ :: పాడిరైతు కుటుంబాల ఆర్థికాభివద్ధికి కృష్ణామిల్క్ యూనియన్ అన్నివిధాలా సహకారమందిస్తామని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన పాడిరైతు కలపాల శ్రీధర్ కుమారుడు శ్రీరుషి కళ్యాణం సందర్భంగా శుక్రవారం కళ్యాణమస్తు బంగారు నాణేన్ని అందజేసి ఆశీర్వదించారు. తదనంతరం పాడిరైతులతో మాట్లాడుతూ పాడిరైతు కుటుంబాల ఆర్థికాభివృద్దే ధ్యేయంగా కృష్ణామిల్క్ యూనియన్ ద్వారా అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాడిరైతు కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలుస్తున్న మనదైన కష్ణామిల్క్ యూనియన్ అభివద్ధికి పాల ఉత్పత్తి పెంచడం ద్వారా సహకారమందివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఆధ్యక్షుడు కసుకుర్తి నిరంజనరావు, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్, మేనేజర్ కిలారు కిరణ్కుమార్, పాలకవర్గ సభ్యుడు అర్వపల్లి సీతారామయ్య, సూపర్వైజర్ గోపాల్, రామచం ద్రరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు సాయం అందిస్తున్న శ్యామ్‌కిషోర్‌నాయుడు

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డలోని సింహాద్రి కాలనీకి చెందిన ముల్లపూడి వెంకట నరసమ్మ అనారో గ్యంతో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న శ్యామ్ కిషోర్ నాయుడు రూ 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. వెంకట నరసమ్మ భర్త వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మతిచెందగా వెంకట నరసమ్మ వెన్ను నొప్పి సమస్యతో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు శ్యామ్ కిషోర్ నాయుడు సింహాద్రి కాలనీలోని వారి ఇంటి వద్దకు వెళ్లి నరసమ్మను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు డేగల రాఘవ, తోట నరసింహనాయుడు, మోపిదేవి కోటేశ్వరరావు, సాయి పనేంద్ర, అలపర్తి గోపి, ముళ్ళపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పూడ్చిన గండి

పైలెట్ స్కీమ్ గండి పూడ్చివేత

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం పైలెట్ స్కీం చెరువుకు పెట్టిన గండిని ఎట్టకేలకు పూడ్చారు. పంచా యతీ అధికారులు దగ్గరుండి పనులు చేశారు. 'పైలెట్ స్కీం చెరువుకు మురుగునీరు' అనే శీర్షికతో ప్రజాశక్తి పత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు.

ఈ క్రాప్‌పై రైతులకు అవగాహన

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పెడన : ప్రభుత్వం కల్పిస్తున్న ఈ క్రాఫ్ విధానాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెనుమల్లి, నేలకొండపల్లి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు ఈ క్రాఫ్ విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ క్రాఫ్ విధానాన్ని అమలు పరిచే ప్రక్రియను రైతులందరూ తెలుసుకోవాలని సూచించారు. రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి ఎలా సాధించాలో వివరించారు. అంతేకాకుండా ఎరువులు, పురుగు మందులు చల్లే విధానాన్ని సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ క్రేఫ్ లో నమోదు చేసుకున్న వారి జాబితాలను రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శనలు చేసి అందరికీ వివరించారు. ఈ కార్యక్రమంలో పెనుమల్లి, నేలకొండపల్లి సర్పంచులు గరికపాటి రామానాయుడు, ఊచా వెంకటేశ్వరరావు, ఎంపీపీ రాజులపాటి అచ్యుతరావు, విఆర్ఓ గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా సెంటర్ లైటింగ్ ఏర్పాటు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం సూరంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సిపెట్‌కు సమీపంలో అడ్డరోడ్డు వద్ద ఏర్పాటు చేస్తున్న సెంటర్ లైటింగ్ వివాదాస్పదమైంది. పంచాయతీ అధికారులు అన్ని శాఖల అనుమతులు లేకుండా ఏకపక్షంగా దీనిని నిర్మిస్తున్నారని పలువురు గ్రామస్తులు ఎంపీపీ రవికి ఫిర్యాదు చేశారు. పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసే ఈ లైటింగ్ కు పంచాయితీ డిపిఓ, డిఎల్పిఓ, పంచాయతీ రాజ్ డి ఈ వద్ద అనుమతులు ఉండాలని, ఇవేమీ లేకుండా పనులు చేపట్టారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో లక్షల రూపాయలు ఏవిధంగా ఖర్చు పెడతారని స్థానిక గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ అధికారులను అడగ్గా ఆర్ అండ్ బి నుంచి అనుమతులు తీసుకొని లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెబుతున్నారు. అడ్డరోడ్డు వద్ద లైటింగ్ లేకపోవడంతో దొంగతనాలు జరిగే పరిస్థితి ఉందని, అందుకే లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

టిడిపితోనే మహిళా సాధికారత: యార్లగడ్డ

మాట్లాడుతున్న యార్లగడ్డ వెంకట్రావు

ప్రజాశక్తి-గన్నవరం : రాష్ట్రంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు మహిళా సాధికారత వెల్లివిరిసిందని గన్నవరం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావ్ పేర్కొన్నారు. గన్నవరం విమానాశ్రయం సమీపంలోని ఏబీ కన్వెన్షన్ హాల్లో శుక్రవారం తెలుగు మహిళ ఆధ్వర్యంలో 'మీతో మీ నాయకుడు' చర్చావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యార్లగడ్డ మహిళల నుద్దేశించి మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోయాయని, దేశం మొత్తం మీద చుస్తే మన రాష్ట్రంలోనే మహిళలపై ఎక్కువ దాడులు జరగటం సిగ్గుచేటు అన్నారు. ప్రతిరోజు రాష్ట్రంలో ఏదో ఒక చోట మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు భద్రత కల్పించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు మహిళల కోసం ప్రత్యేక చట్టాలు చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో డ్వాక్రా సంఘాలను ప్రవేశపెట్టి మహిళల ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు చంద్రబాబు నాయుడు కషి చేశారని తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక పథకాలు రూపొందించారని గుర్తు చేశారు. మహిళలకు రుణ వసతి కల్పించి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు టిడిపి ప్రభుత్వం కషి చేసిందని చెప్పారు. మహిళల ఆర్థిక స్వాలంబనకు తెలుగు తెలుగుదేశం ప్రభుత్వం చేసిన కషిని వివరించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమ ముల్పూరి సాయి కళ్యాణి, మండవ లక్ష్మి, చిక్కవరపు నాగమణి, మండవ రమ్య, పొట్లూరి జ్యోతి, బేతల ప్రమీలరని, వల్లభనేని నాగమణి పాల్గొన్నారు.

కెయు రిజిస్ట్రార్‌గా శోభన్‌బాబు నియామకం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా ఆచార్య కె శోభన్‌బాబు నియమితులయ్యారు. నరసరావు పేట జేఎన్‌టియూ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, మాథెమాటిక్స్ విభాగం ఆచార్యులు గా పనిచేస్తున్న కె శోభన్ బాబు శుక్రవారం భాద్యతలు స్వీకరించారు. సహాయ ఆచార్యులు గా జేఎన్‌టి యూ అనంతపురం, కాకినాడ ఇంజినీరింగ్ కళాశాలలో, సహా ఆచార్యులుగా విజయనగరంలో విధులు నిర్వర్తించారు. నూతన రిజిస్ట్రార్ గా భాద్యతలు స్వీకరించిన శోభన్ బాబు ను ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి అభినందించారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది నూతన రిజిస్ట్రార్ ను అభినందనలు తెలిపారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక 17వ వార్డుకు చెందిన మరీదు రాహుల్ నేతత్వంలో టిడిపి ఇంచార్జ్ వెనిగండ్ల రాము సమక్షంలో 300 మందికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శుక్రవారం 17వ వార్డుకు చెందిన మరీదు రహుల్‌కు వార్డు బాధ్యతలను అప్పజెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, నాయకులు డాక్టర్ గోర్జి సత్యనారాయణ, గోకవరపు సునీల్, యార్లగడ్డ సుధారాణి, మరీదు విజయలక్ష్మి, పెద్దు వీరభద్రరావు, షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి - గుడివాడ : పట్టణంలో 15,19వ వార్డులలో శుక్రవారం బాబు ష్యురిటి భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాలను స్థానిక బస్టాండు, సత్యనారాయణ పురంలలో టిడిపి జనసేన పార్టీల శ్రేణులు నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్‌చార్జి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్‌లు ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, జనసేన అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, నాయకులు వేమూరి త్రినాథ్, సాయన రాజేష్, పోలాసి ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రైసైకిల్ పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

చెక్కు అందిస్తున్న కలెక్టర్ డిల్లీరావు

ఎన్‌టిఆర్ జిల్లాలో విద్యా దీవెన జమ

33,602 మందికి రూ.31.72 కోట్ల లబ్ధి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ) : విద్యకు పేదరికం అడ్డుకాకుడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన పథకాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. 2023 అక్టోబర్-నవంబర్-డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యా దీవెన జిల్లాస్థాయి కార్యక్రమం కలెక్టరేట్ వీసీ హాల్‌లో కలెక్టర్ ఎస్. డిల్లీరావు, నగర్ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు, వివిధ కార్పోరేట్ చైర్మన్‌లతో కలిసి విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన చెక్కును అందజేశారు. అనంతరం కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ విద్యా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా మన రాష్ట్రంలో నాడు-నేడు పథకాన్ని అమలు చేయడం ద్వారా పాఠశాలల రూపురేఖలనే మార్చివేసినట్లు తెలిపారు. అత్యాధునిక మౌలిక వసతులను ఏర్పాటు చేసి ప్రాథమిక విద్య నుండే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం మెరుగు పరచడం ద్వారా విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. జిల్లాలో ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, బిఇడి, అగ్రికల్చర్, మెడికల్, నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్న 37,178 మంది విద్యార్థులకు రూ.31.72 కోట్లను 33,602 మంది తల్లుల ఖాతాలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు ఆవుతు శ్రీ శైలజారెడ్డి, బెల్లం దుర్గా, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షులు షేక్ గౌస్ మొహిద్దీన్, భట్రాజ్ కార్పోరేషన్ చైర్‌పర్సన్ కూరపాటి గీతాంజలి, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కోఠారి, సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి. వి.విజయభారతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, డ్వామా పీడీ జె.సునీత పాల్గొన్నారు.

హోంగార్డ్స్ కమాండెంట్‌గా మహేష్ బాధ్యతలు

ప్రజాశక్తి-విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ హోంగార్డ్స్ కమాండెంట్ కె.వి.ప్రేమ్‌జిత్ విశాఖపట్నం హోంగార్డ్స్ కమాండెంట్‌గా బదిలీ అయ్యారు. దీంతో కర్నూలు రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్ కుమార్‌కు విజయవాడ రీజియన్ కూడా హోంగార్డ్స్ కమాండెంట్‌గా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఎం.మహేష్ కుమార్ శుక్రవారం విజయవాడ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ అదనపు బాధ్యతలను స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జిల్లా పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటాను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేటి నుండి టెట్ పేపర్ 2 ఎ పరీక్షలు

విజయవంతంగా ముగిసిన పేపర్ 1 ఎ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ అర్హత పరీక్షల్లో (టెట్) భాగంగా శనివారం నుండి స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయ అర్హత పరీక్షలు ప్రారంభమవుతాయని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ తెలిపారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు నిర్వహించిన పేపర్ 1 - ఎ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయని తెలిపారు. పేపర్ 1(ఎ) ఎనిమిది సెషన్లలో నిర్వహించగా, చివరి రోజు శుక్రవారం 28446 మందికిగాను 24632 మంది (86.59 శాతం) హాజరయ్యారని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయ అర్హత పరీక్షకు సోషల్, తెలుగు విభాగాలు రెండింటికీ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 1400 మందికిపైగా ఉన్నారు. వీరికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా రెండు సబ్జెక్టులను ఒకే సెంటర్లో ఒకేరోజు పరీక్ష రాసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ విభాగంలో ఇంకా ఎవరైనా అభ్యర్థులకు పరీక్షా కేంద్రం విషయంలో సమస్యలుంటే జిల్లా విద్యాధికారిని సంప్రదించాలని సూచించారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష ప్రాథమిక కీ శనివారం విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు ప్రాథమిక కీ పరిశీలించి తమ అభ్యంతరాలను ఎపీ టెట్ వెబ్సైటుకు పంపాలన్నారు. ఇందుకు ఒకరోజు మాత్రమే గడువు ఇచ్చినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రానికి వచ్చిన అభ్యర్థి ముఖాధారిత గుర్తింపు (పేషియల్ అటెండెన్స్) విధానాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా గుర్తించడం సంతోషంగా ఉందన్నారు. ఈవిధానంలో అభ్యర్థి దరఖాస్తులో జతపరిచిన ఫోటో, పరీక్షకు హాజరైన అభ్యర్థి ఫోటోతో సరిపోలుస్తుందని, రెండు ఫోటోలు ఒకే అభ్యర్థిదేనని నిర్ధారించిన తర్వాతే సర్వర్ ఆ అభ్యర్థిని కంప్యూటర్లో పరీక్ష రాయడానికి అనుమతిస్తుందని తెలిపారు. ఒకవేళ దరఖాస్తులోని ఫోటో మసకగా ఉన్నా, అభ్యర్థి పాత ఫోటోగా ఉన్న, సరిపోలనిదిగా ఉన్న వెంటనే ఈ లోపాలను గుర్తించి డిపార్ట్మెంట్ అధికారులకు తెలియజేస్తుందని తెలిపారు.

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 10న బాలోత్సవ్ భవన్లో జరిగే ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ పోస్టర్ శుక్రవారం విజయవాడలోని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఆవిష్కరించారు. మహిళాదినోత్సవం సందర్భంగా వారిలో ఉండే ప్రతిభను ప్రోత్సహించేందుకు నిర్వాహకులు చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. మహిళా సమానత్వం సాధించిన నాడే దేశం ముందుకు పోతుందని, ఇలాంటి మంచి కార్యక్రమాల ద్వారా మహిళల్లో దాగివున్న ప్రజ్ఞ ప్రపంచానికి తెలుస్తుందని అన్నారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం మహిళా విభాగాల ఆధ్వర్యంలో ఈ ఎగ్జిబిషన్ జరుగుతుందని నిర్వాహకలు ఎ.సంధ్యారాణి, కె.స్వరూపరాణి, జి.జ్యోత్స్న తెలిపారు. 10వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు బాలోత్సవ భవన్లో ఎగ్జిబిషన్ ప్రారంభం అవుతుందని, మధ్యాహ్నం 3.30 గంటలకు బెస్ట్ ఫ్రం వేస్ట్ క్రాఫ్ట్ డెమో కార్యక్రమాన్ని స్వాతి పూర్ణిమ, పేపర్ క్విల్లింగ్ కార్యక్రమాన్ని మేడా రజని ప్రారంభిస్తారని, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, అతిధుల ప్రసంగాలు, బహుమతుల ప్రధానోత్సవం జరుగుతుందని నిర్వాహుకులు తెలిపారు. ఈపోస్టర్ ఆవిష్కరణలో ఫోరం ఫర్ ఆర్టిస్ట్ అధ్యక్షులు ఎ. సునీల్ కుమార్, ప్రియాంక, లలితా సౌజన్య, సేఫ్ ప్రెసిడెంట్ జి. జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై పెట్టిన కేసులు ఎత్తేయాలి

ఎపి ఎన్‌జివోస్ రాష్ట్ర నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : శాంతియుతంగా చేపట్టిన ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులపై పెట్టిన పోలీసు కేసులను ఎత్తివేయాలని ఎపి ఎన్‌జివోస్ రాష్ట్ర నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెవి శివారెడ్డి, సిహెచ్.పురుషోత్తమ నాయుడు డిమాండ్ చేశారు. ఏపీ ఎన్జీజీవోస్ సంఘానికి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా వారు నూతనంగా ఎన్నికైన సందర్భంగా స్థానిక గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీజీవో హోంలో శుక్రవారం ఏపీ రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు యం రాజుబాబు ఆధ్వర్యంలో సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి, పురుషోత్తం నాయుడు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ఏపీ జేఏసి ప్రభుత్వం దగ్గర పెట్టిన 49 డిమాండ్లలో కొన్నింటిని ఈనెల 31 లోపు పరిష్కరిస్తున్నామని ప్రభుత్వం రాత పూర్వకంగా హామీ ఇచ్చిందన్నారను. ప్రభుత్వం వాటిని చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రమణ, తూర్పు కష్ణాజిల్లా అధ్యక్షులు ఉల్లి కష్ణ, రవాణాశాఖ ఉద్యోగుల రాష్ట్ర సంఘం కోశాధికారి యం.ఆనంద్ కుమార్, జోనల్ కార్యదర్శి కెవివి నాగ మురళి, సహ అధ్యక్షురాలు జి ఉషాసుందరి, సంఘ సభ్యులు ఎం.రవితేజ, కె.లోకేష్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE V th ADDL. JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA

O.S.No.1227/2023

Between:
Abdul Khaliq ... Plaintiff
AND
Abdul Mazeed Shoyab & Others ... Defendants

Defendant No.4:
Abdul Bari, S/o Late. Abdul Haq, Musilm, aged about 35 years, D.No.150-97, C/o. Sk. Subhani, Crane Driver, End To Devi Store Road, Behind to building Lakshmi Durga Tailor Shop, Sanath Nagar, Vijayawada.

పై నెంబరు దావా నందు 4వ ప్రతివాది అయిన మీ యొక్క హాజరు నిమిత్తము శ్రీ కోర్టువారు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా మీరు ది.20-03-2024న ఉదయం గం. 10.30 ని.లకు మీరు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ, న్యాయవాది గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకోవలెను. లేనియెడల దావా మీ పరోక్షమున తీర్మానింపబడును.

/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము ///

వేలం తేది. 20-03-2024

Sk. Vali, Advocate
Vijayawada, NTR Dist. AP

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT VUYYURU
I.A.NO.203/2022 IN 0.S.NO.19/2000

Between:
Pothuneedi Venkateswara Rao ...... Petitioner/Plaintiff
And
1. Pothuneedi Krishna Murthy (died)
2. Kode Hemalatha
3. Gummmadi Pushpalatha
4. Madu Seetha Mahalakshmi
5. Madu Koteswara Rao
6. Madu Srinivasa Rao
7. Potluri Hanumantha Rao. and others .... Respondents/defendants

To : D.7 :
Potluri Hanumantha Rao, S/o.Veera Raghavaiah, Hindu, aged about 58 years, R/o. H.No.9-166/A. Rama Nagar, Gannavaram Village and Mandal, Krishna District.

పై నెంబరు I.A.NO.203/2022 IN 0.S.NO.19/2000 7వ ప్రతివాది అయిన పొట్లూరి హనుమంతరావు అను మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ఎన్నిసార్లు దావా నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకంగా పైన తెల్పిన అడ్రస్సులో లేరని చెప్పి సదరు నోటీసులు త్రిప్పి పంపియున్నారు. కావున మీ హాజరు కొరకు పేపర్ పబ్లికేషన్ నిమిత్తం కోర్టువారు ది. 8-2-2024న I.A.NO.203/2022 IN 0.S.NO. 19/2000 నందు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున 7వ ప్రతివాది అయిన మీరు ది. 04-04-2024వ తేదీన ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, లేక మీ వకీలు ద్వారా గానీ పైన తెలిపిన కోర్టు వారి యెదుట హాజరు కావలసినదిగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేది : 04-04-2024

ఇట్లు
మాదల ప్రసాదరావు,
వాది తరఫున న్యాయవాది,
గండిగుంట, ఉయ్యూరు.
సెల్ : **8143793908**

మొదటిపేజీ తరువాయి

అట్టహాసంగా విద్యాదీవెన

జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ, వ్యవసాయ సలహామండలి వైస్ చైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి, రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, పామర్రు ఎమ్మెల్యే కైలే అనీల్‌కుమార్, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కొడాలి నాని, ముడా చైర్మన్ బొర్రా దుర్గాభవానీ, ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ పిన్నింటి మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ, వైసిపి మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల ఇన్చార్జులు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), ఉప్పాల రాము తదితరులు హెలీప్యాడ్ వద్ద సిఎంకు స్వాగతం పలికారు.

మూతపడ్డ దుకాణాలు

సిఎం రాకతో పామర్రులో దుకాణాలను మూయించారు. పామర్రు నాలుగు రోడ్ల సెంటర్ నుంచి సభాస్థలి వరకు దుకాణాలు, హోటళ్లను మూసివేశారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

బృందాలను నిరంతరం పర్యవేక్షించి పరీక్ష నిర్వహణకు కృషి చేశారు.

పరీక్షా కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లను పరీక్షల నిర్వహణకు ఏవిధంగా ఏర్పాట్లు చేసిందీ అడిగి తెలుసుకున్నారు. నగరంలోని బిషప్ అజరయ్య జూనియర్ కళాశాల, శ్రీ శారద కళాశాలలో పరీక్షా కేంద్రాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.

కృష్ణాజిల్లాలో 20,492 మంది హాజరు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. కష్ణాజిల్లా వ్యాప్తంగా 21,610 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 20,492 మంది హాజరైనట్లు ఆర్ఐఓ రవికుమార్ తెలిపారు. 423 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 59 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిశీలనకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని, వీరు 16 కేంద్రాలు తనిఖీ చేయగా, వీటిలో ఆర్ఐఓ 4, డిఇసి సభ్యులు 6 కేంద్రాలను తనిఖీ చేసినట్లు చెప్పారు.

ట్రాఫిక్ జామ్

నగరం, పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులకు గన్నవరం మండలం గూడవల్లి, విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు, ఎనికేపాడు తదితర ప్రాంతాల్లోని కేంద్రాలను కేటాయిచడంతో కోల్‌కతా జాతీయ రహదారిపై పూర్తిగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. జాతీయ రహదారి వెంబడి పోలీసు బందోబస్తు ఉన్నా అదే రోడ్డులో పదుల సంఖ్యలో పరీక్షా కేంద్రాలు ఉండడంతో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడం వారి వల్ల కాలేదు. వేలాది మంది ఒకే సమయంలో ప్రయాణించాల్సి రావడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వాహనాలు ఆగిఆగి ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సమయానికి చేరుకుంటామో లేదోనని తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఉదయం 7.30 గంటలకు బయలుదేరితేగాని గూడవల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి హడావుడిగా విద్యార్థులు వెళ్లారు.

శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం, పెనుగంచిప్రోలు

ఎన్‌టిఆర్ జిల్లా.

టెండరు ప్రకటన

NIT No. C1/1076/2016, **Date : -02-2024**

శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం నందు 1) చిన్న తిరునాళ్ళ-2024 సందర్భంగా తాత్కాలిక విద్యుత్ దీపాల అలంకరణ గాను 2) తిరునాళ్ళ మెయింటినెన్స్ పనులకు రోజువారి కూలీలను సప్లయ్ చేయుటకు టెండరు వివరముల కొరకు www.tender.apeprocurement.gov.in ఈ-ప్రొక్యూర్‌మెంట్ సైట్ నందు చూడగలరు.

3) శ్రీ అమ్మవారి చిన్న తిరునాళ్ళ సందర్భంగా ది. 25-3-2024 నుండి 29-3-2024 భోజనముల ఏర్పాట్లు కొరకు సీల్డ్ కొటేషన్లను కోరుట.

4) **టెండర్ - కం - బహిరంగ వేలము ప్రకటన**

ది. 23-3-2024 నుండి ది. 3-4-2024 వరకు అనగా 12 రోజులకు దేవస్థానం వారు సూచించిన ప్రదేశంలో A) Colombus, Brake/Disco Dance, Salambo, Dragon Train, Baavi and Children Items Etc., ఏర్పాటు, డిపాజిట్ : 2.00 లక్షలు B) Jaint Wheel నిర్వహణ (Jaint Wheel నిర్వహణకు అధీకృత లైసెన్సు & నిర్వహణలో కనీసం 2 సంవత్సరముల అనుభవం కల్గిన వారు మాత్రమే Jaint Wheel టెండర్‌లో పాల్గొనుటకు అర్హులు, డిపాజిట్ : 1.00 లక్ష). బహిరంగ వేలము తేది : 11-3-2024 ఉదయం 11-00 గం.లకు ఇతర వివరములకు కార్యాలయ పనివేళలలో సంప్రదించగలరు.

అమ్మవారి సేవలో

సం/- జంగల శ్రీనివాసరావు, ఛైర్మన్
మరియు ధర్మకర్తల మండలి సభ్యులు

సం/- కె.రమేష్‌నాయుడు
డిప్యూటీ కలెక్టర్ & కార్యనిర్వహణాధికారి

కార్యకర్తల పోరాటమే గెలుపునకు నాంది : కొల్లు

మాట్లాడుతున్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : రాబోయే 40 రోజులు చాలా కీలకమని , ఈ 40 రోజులు ప్రతి కార్యకర్త ఇంటింటికి తిరుగుతూ తెలుగుదేశం పార్టీ గతంలో చేపట్టిన కార్యక్రమం, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ఈ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని మాజీ మంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన "శంఖారావం" సన్నాహక సమావేశంలో కొల్లు రవీంద్ర మాట్లాడుతూ తాడేపల్లి గూడెం సభ తర్వాత వైసిపి పార్టీలో వణుకు మొదలైందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి మినహా ఈ వైసిపి ప్రభుత్వం చేసింది ఏముందో చెప్పాలన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం చేసిన పనులకు రంగులేసుకుని పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికలు నోటిఫికేషన్ కు ఇంకా 15 రోజులు ఉండగా ఇప్పుడు శంకుస్థాపనలని తండ్రి కొడుకుల హడావిడి చేసి ఆర్భాటం చేస్తున్నరన్నారు. నాడు తెలుగుదేశం హయాంలో 2వేల కోట్లతో బందర్ లో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిం చామని, జీ ప్లస్ త్రీ గహాలు, రిజర్వాయర్లు, ఎన్టీఆర్ ఇల్లు, మున్సిపల్ ఆఫీస్, గ్రామాల రహదారులు, సిమెంట్ రోడ్లు, విజయవాడ మచిలీపట్నం రహదారి, 216 జాతీయ రహదారి, కష్ణా యూనివర్సిటీ, పోర్టు నిర్మాణం, బీచ్ అభివద్ధి... ఇలా అనేక సంక్షేమ, అభివద్ధి కార్యక్ర మాలు చేశాం అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొనకల్ల బుల్లయ్య, పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, మాజీ మున్సిపల్ చైర్మన్ బాబా ప్రసాద్, పార్టి పట్టణ అధ్యక్ష కార్యదర్శి లు ఇలియాస్ పాషా, పిప్పళ్ళ వెంకట కాంతారావు, మండల పార్టీ అధ్యక్షుడు కుంచే దుర్గాప్రసాద్ , మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

276 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జగనన్న సురక్ష రెండవ విడత కార్యక్రమాన్ని మండలంలోని పురిటిపాడు గ్రామం ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి పురిటిపాడు, చిన గొన్నూరు సచివాలయ పరిధిలోని 276 మందికి అన్ని రకముల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చినగొన్నూరు సర్పంచ్ కోటప్రోలు నాగు, వైద్యులు డాక్టర్ నాయక్, డాక్టర్ శ్రావ్య సచివాలయ, పంచాయతీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - గుడివాడ : పి.యమ్. సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకం ద్వారా కేంద్రం సబ్సిడీ గరిష్టంగా 60శాతం వరకు ఇస్తుందని ఈ పథకాన్ని అందరు ఉపయోగించుకోవాలని భారతీయ జనతా పార్టీ మచిలీపట్నం పార్లమెంట్ కన్వీనర్, జిల్లా అధికార ప్రతినిధి సూరే లక్ష్మీనారాయణగాంధీ అన్నారు. శుక్రవారం అయన విలేకర్లుతో మాట్లాడుతూ 3 కిలోవాట్ల సౌర విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేసుకోవడానికి ఒక లక్ష నలభై ఐదు వేల రూపాయలు ఖర్చు అయితే అందులో కేంద్రం 78వేల రూపాయలు ఇస్తుందని అన్నారు.

అవినీతి నేతలను ప్రజలు ప్రశ్నించాలి

- ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్ వి సుబ్రహ్మణ్యం

మాట్లాడుతున్న ఎల్‌వి సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : ప్రజాస్వామ్యం వికసించాలంటే అవినీతిపరులైన రాజకీయ నేతలను, ప్రజా ప్రతినిధులను ప్రజలు ప్రశ్నించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ చీఫ్ సెక్రటరీ, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఉపాధ్యక్షులు ఎల్.వి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శుక్రవారం మచిలీపట్నంలోని శ్రీ పద్మావతి మహిళా హిందూ కళాశాల సెమినార్ హాల్లో 'ఓటు వేద్దాం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం' అనే అంశంపై జరిగిన కళాజాతకు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. గెలుపే లక్ష్యంగా వందలాది కోట్లు వెచ్చిస్తూ కుల, మత ప్రలోభాలను ప్రేరేపిస్తూ రాజకీయ నేతలు, ఓటర్లను సంతలో వస్తువుగా మారుస్తున్నా రన్నారు. చట్టసభలలో చట్టాల రూపకల్పనలో ఎలాంటి పాత్ర ఉండటం లేదని అధికారులను బదిలీలపై, దనార్జన పై దష్టి పెట్టుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ అధికార యంత్రాంగం, అధికార పార్టీ నేతలకు తొత్తులుగా మారి ఓటర్ల జాబితాను లోపభూఇష్టంగా మార్చినారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి ధన్వంతరి ఆచార్య లంకి శెట్టి బాలాజీ ఆర్ కోటేశ్వరరావు ఎన్ సుందర్రాం కారుమూరి రాజేంద్రప్రసాద్, వేము కోటేశ్వరరావు ,తంగలవారి బాబు, పిబి ఫణికుమార్, పోతురాజు, తదితరులు ప్రసంగించారు. రంగం రాజేష్ బందం ఓటర్ల చైతన్యంపై ఆట మాట పాటలతో సాంస్కతి కార్యక్రమాలను నిర్వహించి సబికులను ఆలోచింపజేశారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - వత్సవాయి : సిఎం జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పాలనలో బిసి, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ వర్గాల వారికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. డబ్బాకుపల్లి గ్రామం నుండి 40 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలోకి చేరారు. దారెల్లి సుధీర్ కుమార్, దారెల్లి రాజు, కుక్కల రాజు, కుక్కల నాగేంద్రబాబు, నిమ్మకాయల ఇశ్రాయేలు, కుక్కల మధు, దారెల్లి ప్రభుదాస్, దారెలు రమేష్ దారెల్లి వెంకటేశ్వర్లు పాలు మాలు బాబు దారే నాగేశ్వరరావు పాల్మాల్ విజయమ్మ కంచిపోలు వెంకటరత్నం కంచ పోగు పుష్పరాజ్యం దారెల్లి ప్రసాదు బంక వెంకటేశ్వర్లు గారెల్లి బాబు షేక్ బుడే షేక్ హుస్సేన్ షేక్ జానీ పంతంగి గోవిందు బండి లక్ష్మయ్య బండి గోపి బండి సాయి షేక్ నూరుల్లా కంచర్ల సందీప్ తదితరులను సామినేని ఉదయబాను పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

సిఎం సభకు తరలిన వైసిపి శ్రేణులు

పెదపారుపూడి నుంచి తరలివెళ్తున్న నాయకులు

పమిడిముక్కల మండలం నుంచి తరలివెళ్లిన కార్యకర్తలు

ప్రజాశక్తి-పెదపారుపూడి : పామర్రులో శుక్రవారం జరిగిన సీఎం సభకు పెదపారుపూడి మండలం నుంచి భారీగా తరలివెళ్లారని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. ఎంపీపీ ఆధ్వర్యంలో పెదపారుపూడి మండలం నుండి బస్సులు, టాటా మ్యాజిక్, ఆటోలు బైక్‌లలో ప్రజలు తరలివెళ్లారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గోళ్ళ సోమేశ్వరరావు , నాగదేశిబ్రహ్మణ్యం, తుమ్మల కోటేశ్వరరావు హౌసింగ్ ఏఈ మల్లికార్జునరావు, మాజీ ఎంపీటీసీ చేబ్రోలు సుజాత , బ్యుల రాణి ,సచివాలయ మండల అధ్యక్షుడు జాజుల చిన్నారి , నాలి రఘు ,శ్రీధర్ వైయస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు . **ప్రజాశక్తి-పమిడిముక్కల :** వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వం అని పమిడిముక్కల మండల వైయస్సార్ పార్టీ అధ్యక్షులు యలమంచిలి గణేష్ అన్నారు. శుక్రవారం పమిడిముక్కల మండలంలోని వీరంకులలో ఆయన మాట్లాడుతూ పామర్రులో జరిగిన సిఎం సభకు మండలంలోని లంకపల్లి, కష్ణాపురం, మంటాడ, తాడంకి గ్రామాల నుండి వేలాదిగా కార్యకర్తలు తరలి వెళ్లారని ఆయన అన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత వచ్చిందని ఆయన అన్నారు. పామర్రు ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ గడపగడపకు కార్యక్రమం ద్వారా గ్రామాల అభివద్ధికి పెద్దపేట వేశారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి వెళ్లిన వారిలో నాయకులు ఏనుగ మస్తాన్‌రావు, కంబపు రాంబాబు, సొంటి వెంకటేశ్వరరావు, మారపాక మహేష్, అలీ, వెంకటలక్ష్మి ,సుమలత, నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

వర్ల కుమార్‌రాజాకు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

లంకపల్లిలో 'పల్లెబాట'

ప్రజాశక్తి-పమిడిముక్కల : వైయస్ జగన్మోహన రెడ్డి ప్రభుత్వం అవినీతి ప్రభుత్వం అని, ప్రచారం కోసం ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని పామర్రు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వర్ల కుమార్ రాజు అన్నారు. మండలంలోని లంకపల్లి గ్రామంలో పల్లెబాట కార్యక్రమంలో ఆయన పాల్గొనిఇంటింటికి తిరిగి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందజేస్తామన్నారు. నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ సంక్షేమ పార్టీ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గంటా సురేష్, జక్కా శ్రీనివాసరావు, అబ్బాస్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, కొల్లూరు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసును కలిసిన కార్యకర్తలు

శ్రీనివాసును కలిసిన జనసేన కార్యకర్తలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : జనసేన పార్టీ నాయకులు విక్కుర్తి శ్రీనివాసరావును శుక్రవారం సాయంత్రం చల్లపల్లి అవనిగడ్డ మండలాలకు చెందిన పలువురు జనసేన కార్యకర్తలు మహిళలు మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు తెలిపారు. రానున్న ఎన్నికల్లో జనసేన తెలుగుదేశం పార్టీల ఉమ్మడి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని శ్రీనివాస్ తనను కలిసిన వారికి సూచించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-గన్నవరం : ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. గన్నవరంలో వీకేఆర్ కళాశాల, చైతన్య కళాశా లలో పరీక్షా సెంటర్లు ఇచ్చారు. ఈ రెండు సెంటర్లలో 710 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 690 హాజరయ్యారని , 20మంది పరీక్షలకు గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

మార్పు కోసం సిపిఎంకు మద్దతివ్వండి

ప్రజాశక్తి-అజిత్ సింగ్‌నగర్: వైసిపి, టిడిపి, బిజెపి పాలనలో ఎదుగు, బొదుగు లేని విజయవాడను చూశారని, ఈ సారి సిపిఎం, కమ్యూనిస్టులకు ఒక్క అవకాశం ఇచ్చి మద్దతివ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు కోరారు. ఈ నెల 7వ తేదీ వరకు విజయవాడ సెంట్రల్‌లో చేపట్టిన 'మార్పు కోసం సిపిఎం' ఇంటింటి ప్రచారం న్యూరాజరాజేశ్వరిపేటలో శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా 57, 63 డివిజన్లలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. వీధి సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ చెత్తపన్ను, విద్యుత్ ఛార్జీలు, వంటగ్యాస్ ధరలు, నిత్యావసర ధరలతో ప్రజలు కుంగిపోతున్నారన్నారు. వైసిపి, టిడిపి పాలనలో గత పది సంవత్సరాల్లో న్యూ రాజరాజేశ్వరిపేట, వాంబేకాలనీ ప్రాంతాల్లో నివసిస్తున్న ఇళ్లకు పట్టాలివ్వకుండా మోసం చేశారన్నారు. ప్రతి ఇంటి నుండి పది వేల రూపాయల వరకు పట్టాల పేర్లతో భారం మోపారన్నారు. శాసనసభ్యులు మారారు కానీ పట్టాలు మాత్రం దక్కలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక్క సంతకం, ఒక జీవోతో పట్టాలు వచ్చే అవకాశం ఉన్నా ఉద్దేశపూర్వకంగానే పేదలకు పట్టాలివ్వకుండా తొక్కిపెట్టారని మండిపడ్డారు. అజిత్ సింగ్‌నగర్ నుండి కండ్రిక వరకు ఉన్న అన్ని కాలనీల్లో 40 వేల మందికి కమ్యూనిస్టులు నగరపాలక సంస్థలో అధికారంలో ఉండగా గజం రూపాయిన్నర నుండి 15 రూపాయల్లోపు నామమాత్రపు ధరలకే రిజిస్ట్రేషన్ చేయించి, పట్టాలు ఇచ్చిన ఘనత ఉంది. డిస్నీల్యాండ్‌లో 57 ఎకరాల స్థలాన్ని కబేళా పేరుతో బడా కంపెనీలకు కట్టబెడుతున్నారు. కాలువ కట్టలపై, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారికి ఇళ్లు తొలగించిన సందర్భాల్లో ప్రత్యామ్నాయ స్థలాల కోసం పోరాడింది కమ్యూనిస్టులు మాత్రమేనన్నారు. అటువంటి కమ్యూనిస్టులకు రానున్న ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు బి.రమణరావు, కె.దుర్గారావు, ఇ.వి.నారాయణ, టి.శ్రీనివాస్, రాము, ప్రసాద్, ఎం.వి.రమణ, నాగరాజు, నిజాముద్దీన్, దుర్గాప్రసాద్, కోటేశ్వరరావు పి.సాంబిరెడ్డి, శివ, కె.సూరిబాబు నిర్మలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

ఇంటింటి ప్రచారంలో భాగంగా మహిళల సమస్యలను తెలుసుకుంటున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

జంగా చైతన్యకు 'ఆటా' ఆహ్వానం

ప్రజాశక్తి-హెల్త్‌యూనివర్సిటీ: అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరుకావల్సిందిగా ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ చైతన్య జంగాకు ఆహ్వానం లభించింది. జూన్ 7-9 తేదీల్లో అట్లాంటాలోని జార్జియా వరల్డ్ కాంగ్రెస్ సెంటర్ నందు 18వ ఆటా కన్వెన్షన్, యూత్ కాన్ఫరెన్స్ జరుగనున్నాయి. ఈ మహాసభలకు పలువురు సినీ, రాజకీయ, క్రీడా, వాణిజ్య, కళారంగ ప్రముఖులు హాజరుకానున్నట్లు ఆటా ప్రెసిడెంట్ మధు బొమ్మినేని తెలిపారు. తెలుగు సినీ ప్రతిభను ప్రపంచ దేశాలకు పరిచయం చేస్తూ, మన సినిమాను ప్రపంచ సినిమాతో మమేకం చేసేందుకు కషి చేస్తున్న చైతన్య జంగాను ఆటా మహాసభలకు ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆటా కాన్ఫరెన్స్ కు ఆహ్వానం అందటం పట్ల చైతన్య జంగా సంతోషం వ్యక్తం చేశారు. తెలుగు సినీ, టీవీ రంగాల గొప్పదనాన్ని ఆటా వేదికగా ప్రపంచానికి చాటి చెబుతానని చైతన్య జంగా ఈ సందర్భంగా వెల్లడించారు. చైతన్య జంగాకు ఆటా ఆహ్వానం అందటం పట్ల బిగ్‌బాస్ 6 ఫేమ్ షానీ, ఎఫ్టీపీసీ సెక్రెటరీ వీఎస్ వర్మ పాకలపాటి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రణాళిక ప్రకారం 'సెంట్రల్' అభివృద్ధి : వెలంపల్లి

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం వైసిపి ఇన్‌చార్జి, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ సెంట్రల్ నియోజకవర్గం అభివృద్ధిపై శుక్రవారం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయములో కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యల పరిష్కారానికి ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేయించాలని కోరారు. అలాగే ఎంతో కాలం నుంచి ఆగిపోయిన స్టామ్ వాటర్ డ్రైన్ల నిర్మాణం కోసం సమగ్రమైన ప్రాజెక్టు రిపోర్టును తయారు చేయించాలని కమిషనర్‌ను కోరారు. డ్రైన్ల నిర్మాణానికి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ స్టామ్ వాటర్ డ్రైన్స్ నిర్మాణాలపై నివేదిక అనంతరం పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

3 వరకు జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి-విజయవాడ: రబీ సీజన్ పంటలను ఈక్రాప్‌లో నమోదు చేసి బయోమెట్రిక్ ధ్రువీకరణ పూర్తి అయిన ముసాయిదా జాబితాలను సామాజిక తనిఖీ నిమిత్తము రైతు భరోసా కేంద్రాలలో ఈ నెల 3వ తేదీ వరకు ప్రదర్శించడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారిణి ఎస్. నాగమణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సభలు నిర్వహించి జాబితాలోని పేర్లను రైతులకు చదివి వినిపించటం జరుగుతుందన్నారు. పంట నమోదు లో ఎటువంటి తప్పులను రైతులు గమనించిన లిఖిత పూర్వకంగా ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిశీలించి దిద్దుబాటు చర్యలు తీసుకుంటామన్నారు. కనుక ఈ సమయంలోనే రైతులు అప్రమత్తంగా ఉండి జాబితాలను పరిశీలించుకొని ఏవైనా తప్పులు దొర్లినట్టైతే దరఖాస్తు రూపంలో సంబంధిత గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకుల దష్టికి తీసుకురావాలని రైతులను కోరుతున్నామన్నారు. నవీకరణ, దిద్దుబాటు చేసిన రికార్డ్స్ ను వీఆర్వో, విఎఏ, విహెచ్‌ఏ నిర్ధారణ, ఆమోదానికై మండల వ్యవసాయ అధికారికి, తహశీల్దార్ కు పంపడం జరుగుతుందని ఈ ప్రక్రియ ఈ నెల 5వ తేది లోపు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఆమోదం పొందిన పిదప రబీ క్రాప్ తుది జాబితా ఈ నెల 8వతేదిన అన్ని రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ పంట నమోదు చేసుకొని, బయోమెట్రిక్ ధవీకరణ చేసిన రైతులకు మాత్రమే ప్రకతి వైపరీత్యాలు, ఇతరత్రా కారణాలవలన జరిగిన పంట నష్టానికి ప్రభుత్వం ప్రకటించిన నష్ట పరిహారం పొందేందుకు వీలుంటుందని వ్యవసాయ అధికారిణి నాగమణమ్మ ఆ ప్రకటనలో తెలిపారు.

3న విజయవాడ వాకర్స్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

బ్రోచర్‌ను విడుదల చేస్తున్న విజయవాడ వాకర్స్ సభ్యులు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: విజయవాడ వాకర్స్ అసోసియేషన్ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 3వ తేదీన నగరంలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సిల్వర్ జూబ్లీ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ప్రభాకరరావు తెలిపారు. నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో శుక్రవారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం 3వ తేదీన ఉదయం నుండి సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుతున్న 60 మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందించనున్నట్లు తెలతిపారు. ఈ సమావేశంలో ఉయ్యూరు సాంబిరెడ్డి, కార్యదర్శి వనమా విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

శాంసంగ్ గెలాక్సీలో ఎఐ టెక్నాలజీ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: శాంసంగ్ గెలాక్సీ మొబైల్‌లో ఏఐ సాంకేతిక టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు శాసంగ్ ఏరియా ప్రతినిధి కె.ఈశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు ఏఐ అనేది అత్యంత పరివర్తనాత్మక సాంకేతికత అన్నారు. కొంతమంది ఇంజనీర్లు సమూల మార్పులు తెచ్చి ఫోన్లలో అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించడం వలన ఫోన్లు మన్నిక ఎక్కువ కాలం ఉండే విధంగా తీసుకువచ్చారని తెలిపారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో శాంసంగ్ గెలాక్సీ ఎస్24 ఫోన్‌కు ఎఐ టెక్నాలజీని ఉపయోగించారని దీని ద్వారా అధిక ఫీచర్లు వస్తున్నాయని తెలిపారు. రానున్న కాలంలో అన్ని రకాలైన స్మార్ట్ ఫోన్లకు ఈ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురానున్నారని తెలిపారు.

7న పిబి సిద్ధార్థలో సాంస్కృతిక పోటీలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల స్టూడెంట్స్ అసోసియేషన్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన బ్లిట్జ్‌క్రీగ్ 2024 పేరుతో ఒకరోజు రాష్ట్రస్థాయి అంతర్ కళాశాలల సాంకేతిక, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమ వివరాలు తెలిపేందుకు శుక్రవారం కళాశాలలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ అసోసియేషన్ ద్వారా 2006వ సంవత్సరం నుండి నిరంతరాయంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తద్వారా విద్యార్థుల నిర్వహణా నైపుణ్యం, సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించేందుకు ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు తమ సాంకేతిక, సాంస్కృతిక నైపుణ్యాలతో ఇతరులతో పోటీ పడటానికి ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తుందని తెలిపారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రవికిరణ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా సాంకేతిక పత్ర సమర్పణ, పోస్టర్ ప్రజెంటేషన్, కంప్యూటర్ క్విజ్, కోడింగ్ అండ్ డీకోడింగ్, డేటాథాన్, స్పాట్ ఫోటోగ్రఫీ, నిధి అన్వేషణ, సంగీత వాయిద్య, మిస్టర్ అండ్ మిస్ బ్లిడ్జ్ క్రీగ్, షార్ట్ ఫిల్మ్ వంటి పది అంశాలలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమ సమన్వయకర్త కంప్యూటర్ సైన్స్ ఇంఛార్జి కోనేరు సుధీర్ మాట్లాడుతూ పోటీల అనంతరం సాయంత్రం జరిగే ముగింపు సభలో తమ కళాశాల విద్యార్థులు అందరినీ ఆకట్టుకునేలా ఫ్యాషన్ షో, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారని అనంతరం పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమ వివరాలతో కూడిన గోడ పత్రికను పోటీల నిర్వాహక వర్గం విడుదల చేసింది.

బ్లిట్జ్‌క్రీగ్-2024 గోడపత్రికను ఆవిష్కరిస్తున్న పిబి సిద్ధార్థ కళాశాల సిబ్బంది

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.